# ప్రేమ - పెళ్ళి

"ఏం రామారావు? పెళ్ళెప్పుడు చేసుకుందామనుకుంటున్నావ్?" అని అడిగాను.

తన ఇరవైనాలుగేళ్ళు మొయ్యలేని గాంభీర్యాన్ని ప్రదర్శించటానికి యత్నిస్తూ రామారావు "ఈ 1954 లో అంతో ఇంతో సంస్కారం గల నేను—ప్రేమించిన పిల్లను కాకుండా—ఎవరో పరిచయం చేసిన పిల్లను, ఎవరో సిఫార్సు చేసిన పిల్లను- పెళ్ళాడాలంటే- నాకేమీ ఇష్టంగా లేదండీ" అన్నాడు.

"రామారావు నా స్నేహితుడి కుమారుడు. నాలో సగం వయసు. మొదటి నుంచీ కూడా నాపట్ల తండ్రికి చూపించదగిన వినయ విధేయతలు చూపుతూ, తండ్రి దగ్గిర తీసుకోవటానికి లేని స్వాతంత్ర్యం కూడా నా దగ్గిర తీసుకునేవాడు. చాలా సార్లు వాళ్ళ నాన్న వాణ్ణి గురించి నన్నడిగి తెలుసుకోవటం కూడా జరిగింది. రామారావు హైస్కూలులో స్పెషల్ సబ్జెక్టు తీసుకున్నప్పుడూ, కాలేజీలో గ్రూపు నిర్ణయించుకున్నప్పుడు కూడా నా సలహాలనే పాటించాడు. మా మధ్య ఒకప్పుడుండిన గురు శిష్య సంబంధంలాంటిది శాశ్వతంకాదని నాకు మొదటినుంచీ తెలుసు. అందుచేత అది స్నేహంగా మారటానికి దారులు వేసివుంచాను. రామారావు చదువు పూర్తి చేసి ఉద్యోగంలో ప్రవేశించినాక కూడ అయిదారు నెలల కొక ఉత్తరం రాసేవాడు. ఏ పనిమీదనైనా పెలవుపెట్టి వాళ్ళ ఊరువస్తే నన్ను చూడకుండా తిరిగి వెళ్ళేవాడు కాడు.

కొంతకాలంగా రామారావు పెళ్ళివిషయమై వాళ్ళ నాన్న ఆలోచన చేస్తున్నట్టూ, మంచి కట్నంతోవచ్చిన సంబంధాలు ఒకటి రెంటిని రామారావు పడగొట్టినట్టూ చూచాయగా విన్నాను. దీనిమూలంగా వాళ్ళిద్దరిమధ్యా కొంత ఘర్షణకూడా పెరిగినట్టు తెలిసింది. రామారావుతండ్రి కావటానికి నా స్నేహితుడేగాని వాడు కొడుక్కి అనేక విషయాలలో ఇవ్వదగినంత స్వేచ్ఛ ఇవ్వలేదని నా అనుమానం. ఇద్దరిమధ్యా కక్షలు ఏర్పడితే రామారావుపక్షం వహించటానికికూడా నిశ్చయించుకున్నాను. అయితే ఇప్పుడు రామారావన్న మాటలనుబట్టి తప్పంతా కేవలం వాడి తండ్రిది కాకపోవచ్చునేమో ననిపించింది.

"ఒక పిల్లని ప్రేమించి పెళ్ళాడే అవకాశం ఎట్లా వస్తుందో నా కర్థంగాకుండా ఉంది, రామారావ్!" అన్నాను.

రామారా వాలోచించాడు. అతని కనుబొమలమధ్య ముడిచూస్తే నాకు నవ్వొచ్చింది.

"చేసుకోబోయే పిల్లనిచూసి, కాస్సేపు మాట్లాడితే ప్రేమ ఉన్నదీ లేనిదీ తెలియదండీ?" అన్నాడు రామారావు అమాయకంగా.

"నువు నాతో మాట్లాడేదానికీ నీ అమ్మదగ్గిర మాట్లాడేదానికీ తేడా ఉందంటావా?" అన్నాను.

"అవును, సహజంగా ఉంటుంది." అన్నాడు రామారావు.

"ఏ పిల్లగానీ పెళ్ళిచూపులకు వచ్చినవాడితో మాట్లాడేదానికీ, పెళ్ళయినాక మొగుడితో మాట్లాడేదానికీ తేడా ఉంటుందా?"

"ఉండొచ్చు." అన్నాడు రామారావు, నేనెక్కడికి లాక్కుపోతానో తెలీక.

"నువు కాపరం చెయ్యవలసింది ఆ రెండోమనిషితో. ప్రేమించ వలసింది కూడా ఆమెనే-ఈ పెళ్ళిచూపుల పిల్లనుకాదు అవునా?"

"మనిషి పెళ్ళయాక మారిపోతుందంటారు? అంతేనా?"

"సహజంగా!" అన్నాను, అతనిమాటే అతనికి వప్పగిస్తూ.

రామారావు ఒక్కక్షణం ఆలోచించి, "అమెరికాలోలాగా ట్రయల్ మారేజెస్ ఉండాలనా మీ ఉద్దేశం?" అన్నాడు.

"నా ఉద్దేశంమాట ఉంచు. ప్రేమించి పెళ్ళాడాలంటే నీకు ఆ పిల్లనుగురించి చాలా తెలిసిఉండాలే. ప్రేమించదగినంతగా తెలిసిఉండాలి గద. ఎట్లా తెలుసుకుంటావు? అంతే నే నడిగేది."

"కేవలం మాటవరసకు అడుగుతున్నాను - నవ్వకండి!-ఒక భాగ్యవంతుడు తిండికికూడా లేని పిల్లను పెళ్లాడాడనుకోండి. వాళ్ళిద్దరిమధ్యా చలించని ప్రేమ ఉండేటందు కవకాశంలేదా?" అన్నాడు రామారావు.

"నీ ఉద్దేశం ఆ పిల్ల తనను ఉద్ధరించినవాడిపట్ల యావజ్జీవం కృతజ్ఞతగా ఉంటుందనా?"

"అవును. అదికూడా ఉండవచ్చుకద?"

"ఎందుకుండాలో నా కర్థంకాలేదు. పెళ్ళాడిన తరవాత ఆ పిల్ల బీదవాళ్ళ కుమార్తె కావటం మానేసి ధనికుడి భార్య అవుతుంది. దానికి అనుగుణంగా మారుతుంది. తాను ఒకప్పుడు సరిగా తిండితినలేదన్న సంగతి ముద్దముద్దకూ జ్ఞాపకం తెచ్చుకుంటుందనుకున్నావా?"

రామారావు తికమకపడి, "మీరు మనుషులను గురించి దారుణంగా మాట్లాడుతున్నారు." అన్నాడు.

"నిజమే నీకు దారుణంగా కనిపిస్తోంది. ఇంతకీ ఒకవిషయం చెప్పు; నీకు మా అందరిలాగా వివాహంచేసుకోవటానికి అభ్యంతర మేమిటి?" అన్నాను.

"ఇంత అనుభవముండి మీరే ఆ మాటడిగితే నేనేంచెప్పనూ? సాధారణంగా భార్యాభర్తలు చూడండి. ఒకరినొకరు అర్థంచేసుకుంటారా? ఒకరిపట్ల ఒకరికేమైనా సానుభూతి ఉంటుందా? ఒకే బోనులో పెట్టిన రెండు పులుల్లాగా ఒకరినొకరు బరుక్కుంటారే. ప్రేమ ఉంటే వాళ్ళట్లా చేస్తారా?"

"బహుశా చెయ్యరు. కాని నువ్వనుకునే ప్రేమ ఎట్లావస్తుంది? అది నీకే స్పష్టంగా తెలియదే!"

"పోనీ మీరుచెప్పండి." అన్నాడు రామారావు.

"ప్రేమించటం మగవాడికి తెలిసినట్లు ఆడదానికి తెలీదని ఎవరన్నా అనగా విన్నావా?"

"అటువంటిదే విన్నాను - ఆడవాళ్ళు ప్రేమవిషయాలలోకూడా ప్రాక్టికల్‌గా ఉంటారని!"

"అంటే ప్రేమ తమకు కూడూగుడ్డా, చీరెలు నగలూ పెడుతుందా లేదా అని ఆలోచిస్తారని! ఎందుకో తెలుసా?"

"తెలీదు."

"మరేంలేదు. వాళ్ళకి స్వాతంత్ర్యం లేదుగనక. ఇంకోడికి పెళ్ళాం కావటం కంటె ఆడదానికి మరోవృత్తి లేకపోతే తనకావృత్తి ప్రసాదించే వాడు దేవుడులా కనపడతాడు - నువ్విందాక చెప్పిన ఉదాహరణలో తిండి లేని పేదబాలికకు డబ్బుగలభర్త కనిపించినట్టే. పెళ్ళిదగ్గిరికి వచ్చేసరికి ప్రతిభార్యా పేదబాలికే అనుకో. ప్రతిభర్తా ధనికుడే అనుకో. ఎందుకంటే ప్రతిభార్యా భర్తనుంచి ముందుగా కూడూ గుడ్డా ఆశిస్తుంది. నిన్ను నిరాకరించే అవకాశం ఉండికూడా నువ్వేకావాలని కూచున్న మనిషే నిన్ను ప్రేమించిన మనిషి. రామారావ్! మగవాడైనా అంతే. స్వాతంత్ర్యం లేందే ప్రేమలేదు."

రామారావు కొంచెం ఆలోచించి, "మీరన్నది సబబుగానే ఉంది," అన్నాడు.

"ప్రేమించి పెళ్ళాడిన ఒక జంటను, నే నెరుగుదును. ఆవిడ తాను పెళ్లాడ బోయేవాడు వూళ్ళేలుతాడనుకుంది. గొప్పవాడై పోతాడనుకుంది. ఆశాపాశం ఆమె బుద్ధిని కట్టేసింది. తనమీద ఆమెకుగల శ్రద్ధనుచూసి ప్రేమ అనుకున్నాడు ఆ అమాయకుడు. ఇద్దరూ పెళ్ళాడారు. ఆవిడ కలలు నిజంకాలేదు. ఆవిడ తనను ప్రేమించ లేదని క్రమక్రమంగా ఆయన తెలుసుకున్నాడు. ఇద్దరూ నువ్వన్నట్లు బోనులో పులులయి పోయారు. ఆ ఇల్లాలు తన ప్రేమను త్వరగానే విసర్జించింది. ఎందుకంటే ఆమె ప్రేమించింది ఒక భావివ్యక్తిని. కాని ఆ అభాగ్యుడుమాత్రం తానొకప్పుడు ప్రేమించినపిల్లను, తనకోసం వెయ్యికళ్ళతో వేచివుండి, తను కనిపించగానే గంతు వేసి లేచినపిల్లను, మరవలేక బాధపడ్డాడు. ఆమె భూతవ్యక్తి. ఎవరో దుర్మార్గులు తన ప్రేయసిని అపహరించి ఆమె స్థానంలో ఒక రాక్షసిని పెట్టినట్లుగా బాధపడ్డాడు," అన్నాను.

"మీరు చెప్పినదాన్నిబట్టి నాకు ఆశ కలుగుతున్నది. వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్ళాడారుగద. అటువంటి వివాహాలు వంద జరిగితే అందులో యాభై అయినా సుఖాంతంకావా?" అన్నాడు రామారావు.

"అది ప్రేమ వివాహమని నువ్వే ఆధారంమీద అనుకుంటున్నావు. అది మొదటినుంచి నిర్బంధ వివాహమే. నిర్బంధం పైనుంచి రాలేదు? ఆవిడ తలలోనే వుండిపోయింది. అందుచేత పైకి కనిపించలేదు."

రామారావు మళ్ళీ ఆలోచించాడు.

"పోనివ్వండి, మీరు యెంతోమంది సంసారాలు చూసిఉంటారు. ప్రేమ వివాహాలు చేసుకున్నా, చేసుకోకపోయినా సుఖంగా, ప్రేమగా బతుకుతున్నవారు లేరా?" అన్నాడు రామారావు.

"ఉన్నారు. పెళ్ళాం కుక్కినపేనల్లే పడిఉండి,తన వ్యక్తిత్వాన్నీ చంపుకుంటే భర్త ఆవిడతో పొరపుపొచ్చెం లేకుండా కాపరం చెయ్యటం చూశాను. భర్త భార్య కాళ్ళకి మడుగులొత్తుతుంటే సంసారం ప్రశాంతంగా జరిగిపోవటం చూశాను. భర్త జీవితాన్ని భార్యా, భార్య జీవితాన్ని భర్తా పంచుకుంటూ, ఇద్దరూ కలిసి సంసారాన్ని నిర్మించటం నేను చూడలేదు. అటువంటివాళ్ళెక్కడా లేరని నేనెట్లా చెప్పగలను?" అన్నాను.

"మీరు చెప్పేది దారుణంగా ఉంది." అన్నాడు రామారావు.

"జీవితమే దారుణంగా ఉంది. ఏంచేస్తావ్?" అన్నాను.

"నేను నమ్మను. మీకసలు ప్రేమలోనే విశ్వాసం లేదేమో అని అనుకుంటాను," అన్నాడు రామారావు.

"అది పొరపాటే. ఎందుచేతనంటే, నేను కనీసం ఒక్కపర్యాయం ప్రేమంటే ఎట్లా ఉంటుందో చూశాను."

రామారావుకు నామీద కలిగిన దురభిప్రాయమంతా ఒక్కసారి తుడిచిపెట్టుకుపోయినట్టయింది. అతను ఉత్సాహంతో, "మీకు ప్రేమ అనుభవమయిందా!" అన్నాడు. నాతరం వాడి ప్రేమగాథ వినాలని రామారావుకు అనిపించటంలో కూడా ఆశ్చర్యం ఏమీలేదు.

"దురదృష్టవశాత్తు నా ప్రేమానుభవంకాదు. నా స్నేహితుడిది. అతను మామూలులెక్కన ఏమంత నీతిపరుడుకాదు. ఇతరత్రా చాలా మంచిగుణాలు కలవాడు కావటంచేత నేనతని స్త్రీవ్యసనాన్ని క్షమించగలిగాను. పైగా అతను ఇతరులభార్యల కేసి చూసేవాడుకాడు. అతనికి తగ్గవాళ్ళనే అతను చూసుకునేవాడు.

"ఇది 1934 నాటిమాట. కాటకంలో చాలామంది దివాలాతీశారు. మాబోటి[1] వాళ్ళదగ్గిర డబ్బులేదు. అతనేదో వ్యాపారంలో దెబ్బతిన్నాడు. బాకీలు తీర్చలేక

1. చూ. కుటుంబరావు సాహిత్యం-మూడవ సంపుటం, పు. 95; 'చదువు' పుట-182.

పోయినాడుకూడా. నా కతను మంచిస్నేహితుడు. నా దగ్గిర ఉంటే అతనికి తప్పక సహాయం చేయగలుగుదును. అయితే గుంటూరులో నే నెరిగిన మనిషి ఒకాయన ఉన్నాడు. ఆయన డబ్బు వడ్డీలకిచ్చి బాగుపడ్డాడు. కొటకంలో చాలా పొలాలూ, ఇళ్ళూ ఏర్పాటు చేసుకున్నాడు. ఆయనవల్ల ఏమైనా సహాయం అవుతుందేమోనని నేనూ నా స్నేహితుడూ గుంటూరు చేరాం.

"నాస్నేహితుడికి అప్పటికే మూడుపూటలుగా జ్వరం తగులుతున్నదట. ఆ విషయం నాతో చెప్పకపోతే[1] ప్రయాణం తలపెట్టకపోదును. రాత్రి తొమ్మిదిన్నరకు మేం గుంటూరు స్టేషనులో దిగేసరికి జ్వరం బాగా ఎక్కువయింది. అందుచేత అతను హోటలుకు రానన్నాడు. రైలుపేటలోనే ఎవరో ఎరిగున్నవాళ్ళున్నారని అక్కడికి పోదామని అన్నాడు. అతన్ని అక్కడదించి నేను హోటలుకు పోదామనుకున్నాను. గుర్రబ్బండీ చేసుకుని అతను చెప్పినచోటికి వెళ్ళాం. మాబండి ఆగిన ఇంటిముందే ఇంకోబండి ఆగివుంది. నేనీవిషయం అప్పుడంతగా పట్టించుకోలేదు. నాస్నేహితుణ్ణి బండిదింపి లోపలికి నడిపించాను. అతని జ్వరం క్షణక్షణానికి మరింత నీరస పెడుతున్నట్టు కనిపించింది.

"ఆ ఇల్లు పేదఇల్లులాగే ఉంది. డాబాఇల్లు. ఇంట్లో చవుకబారు సామానున్నది. బయట బండి నిలబడి ఉన్నదిగాని ఇంట్లో కొత్తవాళ్ళెవ్వరూ ఉన్నట్టులేదు. ఒకస్త్రీ తెల్లనిచీరె కట్టుకుని, మొహానికి పౌడరేసుకుని, తల్లో గంపెడు మల్లెపూలు పెట్టుకుని మాకు ఎదురొచ్చింది. ఆమె వాలకమూ, కాళ్ళచెప్పులూ చూసి ఎక్కడికో బయలుదేరబోతున్నదని నే నర్థంచేసుకున్నాను.

"ఆమె నా స్నేహితుణ్ణిచూసి ముందు సంతోషించినట్టు కనబడింది. తరవాత కంగారుపడింది. అతన్ని తానుకూడా పట్టుకుని పక్కగాఉన్న మంచంమీద కూచోబెట్టింది. అతని శరీరస్థితి విచారించింది. వెంటనే బయటికివెళ్ళి రెండు నిమిషాల్లో తిరిగివచ్చి, చెప్పులు ఒకమూల విసరేసి, మంచంమీద నా స్నేహితుడిపక్కనే కూచుని మాట్లాడవాగింది.

"ఆమె ఒకరకంస్త్రీ అని నే నర్థంచేసుకున్నాను. అంటే ఆమె వృత్తి పోల్చుకున్నాను. నా స్నేహితుడికి అటువంటి స్నేహితురాళ్ళున్నారని నాకు తెలుసు. అయితే ఆ స్నేహాలలో నా కెన్నడూ విశ్వాసంలేదు. ఈమనిషి పైకి ఈమాత్రమైనా నా స్నేహితుడిమీద అభిమానమున్నట్టు నటిస్తున్నందుకు నేను కొంతలోకొంత సంతోషించాను.

"మా బండివాడికి నేను డబ్బివ్వటం మరిచానని జ్ఞాపకంవచ్చి బయటికి పరిగెత్తాను. బయట బండిలేదు. అంతకుముందున్న బండికూడాలేదు. మా బండికి తాను డబ్బులిచ్చానని, డాక్టరుకోసం కబురుచేశాననీ ఆవిడ–సరస్వతి–చెప్పింది.

---

1. 'చెపితే' అని వుండాలి.

"ఎక్కడికో ప్రయాణమయినట్లున్నావు, వెళ్ళిరా!" అన్నాడు నా స్నేహితుడు.

"ఏంఫరవాలేదు," అన్నది సరస్వతి. మెల్లిగా తల్లోపూలు తీసేసి, మంచం మీద పడుకున్న నా స్నేహితుడి దిండు పక్కగాపెడుతూ, నేనొక కుర్చీలో దూరంగా కూర్చున్నాను. మా భోజనంవిషయం సరస్వతి అడిగింది. భోంచేసే బయలుదేరామని చెప్పాను.

"కొద్దిసేపట్లో బయట గుర్రబ్బండి ఆగింది. డాక్టరు లోపలికి వచ్చాడు. నా స్నేహితుణ్ణి పరీక్షించి, అప్పుడే చెప్పలేమని టైఫాయిడ్ కావచ్చుననీ అన్నాడు.

"నాకేమీ పాలుబోలేదు. నా స్నేహితుడికి టైఫాయిడ్ జ్వరమే అయితే ఈ సరస్వతిఇంట ఎట్లా ఉంచటం? ఇంకోచోటికి ఎక్కడికి తీసుకుపోతాం? తీసుకుపోదామన్నా నా దగ్గిర డబ్బులేదు. నా స్నేహితుడిదగ్గిర మొదలేలేదు. అతనిమాట అటుంచి నామాటేమిటి? శరీరం అమ్ముకుజీవించే ఆ మనిషి ఇంట్లో నేనెంతకాలం ఉంటాను? వాణ్ణి విడిచి ఎట్లాపోవటం? మా గుర్రబ్బండికి ఆమె డబ్బులివ్వటమే తలవంపులుగావుంది. డాక్టర్ను కూడా ఆమే పిలిపించింది.

"ఆమె బయటికివెళ్ళిపోతే ఈ విషయాలన్నీ నా స్నేహితుడితో మాట్లాడదామనుకున్నాను. కాని ఆమె ప్రయాణం మానేసినట్టే కనబడింది. పైగా రోగిదగ్గిర నుంచి ఇవతలకిరాదు!.... ఆమె ఆ రాత్రి యెంత సంపాదన పోగొట్టుకుందో నాకు తెలీదు.

"డాక్టరు ఏవో మందులు రాసి రోగికి పథ్యం చెప్పివెళ్ళాడు. అప్పటికి పదకొండు దాటింది. ఆరాత్రికి చాప పరుచుకొని అక్కడే పడుకున్నాను. కాని నాకు కలతనిద్రమాత్రమే పట్టింది. ఏవేళప్పుడు నేను కళ్ళుతెరిచి చూచినా ఆ సరస్వతి దేరామేకులాగా అట్లా రోగిపక్కన కూచునేవుంది. తెల్లారి లేచాక చూస్తే ఆ మంచం మీదనే కాళ్ళకాడ అడ్డంగా ముడుచుకు పడుకుని నిద్రపోతూ కనిపించింది,

"నాస్నేహితుడుపట్ల సరస్వతి చూపించిన శ్రద్ధ వర్ణనాతీతం. ఆమె ఏడిచిందనీ, కంగారుపడిందనీ నువ్వు ఒక్కక్షణం అనుకోకు. మొదట్లో నా కామెను చూస్తే కోపమే కలిగింది. కట్టుకున్న పెళ్ళాలుకూడా చూపించని శ్రద్ధ ఈ నీతిలేని మనిషి కేమిటనిపించింది.

"మర్నాడుదయం సరస్వతి ఇంటిపనులు చేసుకుంటునప్పుడు నా స్నేహితుడితో కర్తవ్యం చర్చించాను.

"నీకు అర్జంటుపని లేకపోతే ఇక్కడేవుండిపో. ఏం ఫరవాలేదు. కాని ఎరిగినవాళ్ళంటే డబ్బు పట్టుకురా! దాని దగ్గిర ఎంతో డబ్బుండదు. ఎంత సంపాదిస్తే అంతా ఖర్చుచేస్తుంది. పైగా మొండిముండ! నేనిక్కడ మంచంలో పడివుండగా బయటికివెళ్ళి డబ్బు తీసుకురాదు," అన్నాడు స్నేహితుడు.

"నా కైనా డబ్బుపుట్టలేదు. ఇరవై రూపాయలు పుట్టించటమే యెంతో శ్రమ అయింది. అయితే అదృష్టవశాత్తు నా స్నేహితుడిజబ్బు టైఫాయిడ్ కాదు. వారం రోజుల్లో అతను కోలుకున్నాడు. కాని ఆ వారంరోజులలో నేనుపడ్డ మనోవ్యధతో పోలిస్తే నా స్నేహితుడి జబ్బొక లెక్కలోదికాదు. నాకాయింటవున్న ప్రతిక్షణమూ ముళ్ళమీదవున్నట్టే వుంది. కాని అక్కడి నుంచి పోలేను. ఆ సరస్వతిని గౌరవంగా చూద్దామని ఎంతప్రయత్నించినా నావల్లకాలేదు. కాని ఆమనిషి నా స్నేహితుడిమీద చూపిన భావం నా మీద నాజన్మలో ఎవరూచూపలేదు. ఇంతకన్న నీచమైనమనిషి నామీద అటువంటి ఆదరం చూపినా నేనెంతో సంతోషించివుండేవాణ్ణి. మా స్నేహితుడు తరవాత నాతో అన్నట్టు నేను పదిరూపాయలుపారేస్తే ఆమె నా దగ్గిరికి వస్తుంది. కాని తనకు తానై నన్నుగురించి ఒక్కక్షణంకూడా ఆలోచించలేదు. ఈ సంగతి నే నెరుగుదును. నైతికంగా నా స్నేహితుడికంటె నేనెంతో మంచివాణ్ణి. కాని ఏంలాభం? నన్నెన్నడూ ఏస్త్రీకూడా నిజంగా - నా స్నేహితుణ్ణి ఆ సరస్వతి ప్రేమించినట్టు - ప్రేమించి వుండలేదు.

"ఆ వారంరోజుల్లో సరస్వతి కొన్నివస్తువులుకూడా అమ్మింది. నాకు కాఫీలు చేసియిచ్చింది. భోజనం పెట్టింది. సిగిరెట్లు కొని పెట్టింది. పరాయివాణ్ణనేభావం పోయి నాక నా యెదటే సిగిరెట్లుకూడా కాల్చింది. ఆమె డబ్బుతినడం అన్యాయమని నాకు తెలుసు. అది నీచమనికూడా లోపల నాకొక అనుమానంవుంది. కాని ఈ భావాలన్నింటికి అట్టడుగున, నన్నెవరన్నా అట్లా ప్రేమిస్తే బాగుండుననిపించింది. ఎవరో అనటంకూడా ఎందుకు? ఆమే నన్ను ప్రేమించరాదా అనిపించింది. ఈభావం కలిగినప్పుడు నేను నా స్నేహితుడికేదో అపచారం చేస్తున్నాననికూడా అనిపించింది.

"దురదృష్టవశాత్తు ఇది ఒక్కటి నే నెరిగిన నిజమైన ప్రేమ."

అంతా విని రామారావు, "దారుణం! ప్రేమను యెంత హీనంగా చిత్రించారండీ. ఇంకా ఉదాత్తమైన ప్రేమనుగురించి చెబుతారనుకున్నాను" అన్నాడు. తన అసహ్యాన్ని ఎంతమాత్రం దాచకుండా.

"నేను నీకన్న ఒకతరం ముందు పుట్టినవాణ్ణోయ్. నేను స్వయంగా ఎరిగిన వుదాత్తప్రేమ ఇదే. మీతరంవాళ్ళు ముందడుగు వెయ్యండి. ఇంకా ఉదాత్తమైన ప్రణయంసృష్టించండి!" అన్నాను.

ముద్రణ :
ఆంధ్రజ్యోతి సచిత్ర మాసపత్రిక, 1954